క్లుప్తంగా

విద్యార్థులకు ఐడీకార్డుల పంపిణీ



ఆత్మకూరు : మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు గురువారం పాఠశాల ఉపాధ్యాయులు ఐడీకార్డులు పంపిణీ చేశారు. ఎంఈఓ విజయ్ కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుపై శ్రద్ధ వహించి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను అభినందించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం నిర్మలాకుమారి, ఉపాధ్యాయులు రాజు, సోమయ్య, సమత, సుజాత, వసంత, ప్రసూన, భాగ్యమ్మ, స్వప్న, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడికి చేయూత



నడికూడ : మండలంలోని కౌకొండ గ్రామానికి చెందిన జర్నలిస్టు చుక్క సతీశ్ తండ్రి చుక్క సల్మాన్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న సతీశ్‌తో కలిసి 1996–1997లో ఏడో తరగతి చదువుకున్న స్నేహితులు గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా రూ.10వేలు ఆర్థికసాయం అందించారు. ముక్కెర రాజు, చిరంజీవి, మహ్మద్ సాధిక్ పాషా, మేకల సతీశ్, రాజేందర్, పేర్వాల బాలకృష్ణ, ఓంకార్, పసుల నర్సింగం, వేణు, కుమారస్వామి, చంద్రమౌళి, సుమలత, శారద, జ్యోతి తదితరులు ఉన్నారు.

పంట వివరాలను సరి చేసుకోవాలి

నడికూడ : వానాకాలం సీజన్‌కు సంబంధించిన పత్తి పంట వివరాలను రైతులు సర్వే నంబర్ ఆధారంగా వివరాలను నమోదు చేసుకోవాలని ఏఈఓ ప్రదీప్‌కుమార్ గురువారం ప్రకటనలో తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం జాబితాను ప్రదర్శించి రైతులకు అందుబాటులో ఉంచనున్నట్లు పేర్కొన్నారు. రైతులు తమ మొబైల్ నంబర్ తప్పుగా ఉన్నా, ఉపయోగంలో లేకున్నా సరి చేసుకోవాలని సూచించారు.

బీఆర్ఎస్ నాయకుడికి పరామర్శ



శాయంపేట : మండలంలోని మాందారిపేట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకుడు రేణికుంట్ల ఐలయ్య అనారోగ్యంతో హనుమకొండలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీపీ తిరుపతిరెడ్డి, మండల అధ్యక్షుడు గంగుల మనోహర్‌రెడ్డి గురువారం ఐలయ్యను పరామర్శించారు. పార్టీ యూత్ నాయకులు కొమ్ముల రాకేశ్ ఉన్నారు.

గుండెపోటుతో ఆర్టీసీ డ్రైవర్ మృతి



పరకాల : పట్టణానికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ మడికొండ మొగిలి (50) బుధవారం రాత్రి గుండెపోటుతో మృతిచెందాడు. విధులు ముగించుకుని ఇంటికి వచ్చిన కొద్ది సమయానికే ఆయన తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. దీంతో కుటుంబ సభ్యులు వరంగల్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలిస్తుండగా మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మొగిలి మృతదేహానికి టీపీసీసీ ఉపాధ్యక్షుడు దొమ్మాటి సాంబయ్యతో పాటు పీఏసీఎస్ మాజీ చైర్మన్ బొజ్జం రమేశ్, టీపీసీఎస్ ఎస్సీ సెల్ కమిటీ వైస్ చైర్మన్ డాక్టర్ శ్రీను, కాంగ్రెస్ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు చందర్ తదితరులు నివాళులర్పించారు.

గంజాయి సేవిస్తున్న ఇద్దరి అరెస్టు

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం ముల్కనూరు పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి సేవిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసి వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజు గురువారం తెలిపారు. ముల్కనూరు గ్రామ శివారులో ఇద్దరు యువకులు గంజాయి సేవిస్తున్నారనే సమాచారం వచ్చిందని తెలిపారు. దీంతో దాడులు చేయగా వారినుంచి ద్విచక్ర వాహనం, రెండు సెల్‌ఫోన్లు, ఐదు గ్రాముల ఎండుగంజాయి, రూ.500 లభించినట్లు తెలిపారు. వాటిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఎండుతూ.. తడుస్తూ

- బస్టాండ్ లేక ప్రయాణికుల ఇక్కట్లు
- రోడ్డుపై నిల్చుంటున్న ప్రయాణికులు
- బస్టాండ్ ఏర్పాటు చేయాలని డిమాండ్



అంబేద్కర్ సెంటర్‌లో ఎండలోనే బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

వేలేరు : మండల కేంద్రంలో బస్టాండ్ లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వేలేరు మండల కేంద్రంగా ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా నేటికీ బస్టాండ్ నిర్మించకపోవడంతో పాలకులు, అధికారులపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వేలేరు నుంచి సూమారు 12 గ్రామాల ప్రయాణికులు హనుమకొండ, ఇతర ప్రాంతాలకు వివిధ పనుల నిమిత్తం వెళ్లి వస్తుంటారు. ప్రయాణికుల నుంచి ఆదాయం పొందుతున్న ఆర్టీసీ సంస్థ కనీస సౌకర్యాలు కల్పించడంపై దృష్టి సారించడం లేదని ప్రయాణికులు ఆగ్రహిస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే మండల కేంద్రంలో బస్టాండ్ లేకపోవడంతో వృద్ధులు, వికలాంగులు, మహిళలు, చిన్నారులు, వివిధ కాలేజీలకు వెళ్లే విద్యార్థులు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ ఇబ్బందులు పడుతున్నారు. బస్సుల కోసం దుకాణాలు, హోటళ్లు, పలువురి ఇళ్ల ఎదుట గంటల తరబడి నిరీక్షించాల్సిన దుస్థితి నెలకొందని వాపోతున్నారు. ముఖ్యంగా వివిధ పనులపై మండల కేంద్రానికి, బ్యాంకులకు వచ్చే మహిళా ప్రయాణికులకు బస్‌స్టాండ్, టాయిలెట్ సౌకర్యం లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని, బస్టాండ్ నిర్మించాలని పలుమార్లు అధికారుల, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు సమర్పించినా స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మండల కేంద్రంలో బస్టాండ్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

గత ప్రభుత్వంలో ప్రతిపాదించినా..

నూతన బస్టాండ్ నిర్మాణానికి మండల కేంద్రంలోని రైతు వేదిక ఎదుట గల స్థలంలో ఏర్పాటు చేయాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కొంత మంది నాయకులు స్థలాన్ని పరిశీలించి ప్రతిపాదించారు. కానీ నేటికీ బస్టాండ్‌ను నిర్మించకపోవడంతో స్థానిక ప్రజలకు నిరాశనే మిగిలింది. ఇప్పటికైనా పాలకులు, అధికారులు వెంటనే స్పందించి బస్టాండ్ నిర్మాణానికి చొరవ చూపాలని కోరుతున్నారు.

బస్టాండ్‌ను త్వరగా ఏర్పాటు చేయాలి



వేలేరు మండల కేంద్రం నుంచి హనుమకొండ, ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే ప్రజలు రోడ్లపై నిల్చుని బస్సుల కోసం వేచిచూడాల్సి వస్తుంది. బస్టాండ్ లేకపోవడం వలన హోటళ్లు, ఇళ్ల ఎదుట ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు, పాలకులు స్పందించి బస్టాండ్ నిర్మించాలి.

– సారా వెంకటేశ్, వేలేరు

‘బీసీ’ బంద్‌ను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న నాయకులు

ఎల్కతుర్తి : బీసీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో రేపు (శనివారం) నిర్వహించే బీసీబంద్‌ను విజయవంతం చేయాలని ఆ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ.. బీసీలకు జనాభా నిష్పత్తి ప్రకారం వాటా లభించాలనే డిమాండ్‌తో బంద్‌కు పిలుపునిచ్చినట్లు చెప్పారు. ప్రజలు, వ్యాపారులు, వాణిజ్య వర్గాలు సహకరించాలని కోరారు. బీసీలకు రావాల్సిన వాటాలో కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తుందని ఆరోపించారు. బీసీలకు 42శాతం హక్కు దక్కేలా రాజ్యాంగంలోని షెడ్యూల్ తొమ్మిదిలో చేర్చాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మాజీ జెడ్పీటీసీ వంగ రవీందర్, నాయకులు ఆదరి శ్రీనివాస్, మండల సురేందర్, ఆదరి రవీందర్, దస్తరి శ్రావణ్, భిక్షపతి, నాగరాజు, సదానందం, సంపత్, రమేశ్, తిరుపతి, కిశోర్, బాలరాజుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

- ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి



సీమంతాలు నిర్వహిస్తున్న పద్మావతి

దామెర : పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి అన్నారు. పోషణమాసంలో భాగంగా మండల కేంద్రంలో గురువారం అవగాహన కల్పించడంతో పాటు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు పోషక పదార్థాలు అధికంగా తీసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అన్నారు. గర్భిణులు, బాలింతలు, కిశోరబాలికలు రక్తహీనతకు లోనుకాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు కోమల, రజిత, రమ, వనజ, బాలింతలు, గర్భిణులు, తల్లులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న చక్రపాణి, యాకయ్య, తదితరులు

ఐనవోలు : ఈనెల 24,25వ తేదీల్లో జరిగే రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు, అధ్యక్షుడు బొట్ల చక్రపాణి, గబ్బెట యాకయ్య కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం మండల కేంద్రంలో రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహాసభలో గ్రామ పంచాయతీ ఉద్యోగుల సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు. జీపీ కార్మికులకు మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి పాత కేటగిరీలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా కారోబార్, బిల్ కలెక్టర్లకు స్పెషల్ స్టేటస్ ఇవ్వాలని, కనీస వేతనం రూ.26 వేలు నిర్ణయించి అమలు చేయాలని కోరారు. కార్మికుల అన్ని రకాల సమస్యలను మహాసభలో చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష, కార్యదర్శులు కుమారస్వామి, బొక్కల సుభేందర్, నాయకులు షబ్బీర్, ఏసోబ్, శ్రీనివాస్, చంద్రయ్య, రవి, ఎలిషమ్మ, లచ్చమ్మ, పూల పాల్గొన్నారు.

ఎంపీడీఓగా రామకృష్ణ



నడికూడ : ఎంపీడీఓగా రామకృష్ణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ములుగు జిల్లా నుంచి బదిలీపై వచ్చిన ఆయన.. మండల పరిషత్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు అభినందనలు తెలిపారు. కాగా ఇక్కడ పనిచేసిన ఎంపీడీఓ గజ్జెల విమలను డీపీఓ కార్యాలయానికి అటాచ్ చేసినట్లు ఉన్నతాధికారులు తెలిపారు.

ప్రమాదకరంగా వ్యవసాయ బావి



రోడ్డు సమీపంలో ప్రమాదకరంగా ఉన్న వ్యవసాయ బావి

వేలేరు : మండలంలోని పీచర ప్రభుత్వ పాఠశాల నుంచి లోక్యాతండా గ్రామానికి వెళ్లే రోడ్డుకు సమీపంలో వ్యవసాయ బావి ప్రమాదకరంగా ఉంది. రక్షణ గోడలు ఏర్పాటు చేయకపోవడం, కనీసం సూచిక బోర్డులు కూడా లేకపోవడంతో వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. పదినెలల క్రితం కొత్తగా రోడ్డు నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్ బావి వద్ద రక్షణ గోడలు నిర్మించలేదు. దీంతో నిత్యం ఆదారి గుండా వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయని, ఇటీవల కురిసిన వర్షాలకు బావి నిండుకుండలా ఉందని, అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

విద్యార్థులకు పొంచిఉన్న ప్రమాదం



ప్రైవేట్ పాఠశాల బస్సులో డోరు వద్ద నిల్చొని ప్రయాణిస్తున్న విద్యార్థులు

శాయంపేట : మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలకు చెందిన బస్సులో విద్యార్థులు పరిమితికి మించి ప్రయాణిస్తున్నారు. స్కూల్ బస్సులో డోర్ వద్ద గుంపుగా నిల్చోవడంతో విద్యార్థులకు ప్రమాదం పొంచిఉందని పలువురు హెచ్చరిస్తున్నారు. పాఠశాల బస్సుకు క్లీనర్‌ను నియమించి జాగ్రత్తలు పాటిస్తూ విద్యార్థులను బస్సు ఎక్కించడం, దించడం చేయాలని, కానీ అలాంటి నిబంధనలు పాఠశాల యాజమాన్యం పాటించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. ఎలాంటి ప్రమాదాలు జరగకముందే చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా పలువురు కోరుతున్నారు.

గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలి

- ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు



వెల్లంపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ ఆంజనేయులు

పరకాల : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు పూర్తిచేసి ఈనెల చివరి తేదీలోపు గృహ ప్రవేశాలు జరిగేలా చూడాలని ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు కోరారు. మండలంలోని వెల్లంపల్లి గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను గురువారం ఆయన పరిశీలించారు. మండలంలోని 10 గ్రామాలకు 285 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయగా వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న 169 ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో బిల్లులు జమైనట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఇసుక, కంకర మొదలైన సమస్యల ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తహరాపూర్‌లో పశువైద్య శిబిరం



పశువులకు టీకాలు వేస్తున్న డాక్టర్ సునీల్

శాయంపేట : మండలంలోని తహరాపూర్ గ్రామంలో మండల పశువైద్యధికారి సునీల్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. అనంతరం డాక్టర్ సునీల్ మాట్లాడుతూ.. పశువుల్లో అధిక జ్వరం, డెక్కలు, నోటిలో పుండ్లు ఏర్పడి పచ్చిక తినకపోవడం, పాల దిగుబడి తగ్గపోవడం, వ్యాధి తీవ్రత పెరిగి పశువులు మృత్యువాత పడడం జరుగుతుందని తెలిపారు. పశువులు అనారోగ్యంగా ఉంటే రైతులు వెంటనే పశువైద్యాధికారులను సంప్రదించాలని కోరారు. నవంబర్ 15 వరకు పశువైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పశువైద్యాశాల సి బ్బంది రమేశ్ బాబు, రవి, సదానందం పాల్గొన్నా రు.

‘రైతులను విస్మరించిన రాష్ట్ర ప్రభుత్వం’

ఎల్కతుర్తి : రాష్ట్ర ప్రభుత్వం రైతులకిచ్చిన హామీ మేరకు సన్నాలకు రూ.500 బోనస్ ఇవ్వకుండా రైతులను విస్మరించిందని బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌యాదవ్ విమర్శించారు. రైతులకు వెంటనే బోనస్ డబ్బులు బ్యాంక్ ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు సన్నాలు సాగుచేసే రైతులకు బోనస్ ఇస్తామని హామీ ఇచ్చి గద్దెనెక్కిందని అన్నారు. అధికారం చేపట్టిన తర్వాత రైతులకు బోనస్ ఇవ్వకుండా మోసం చేసిందన్నారు. ఇప్పటికైనా రైతులకు బోనస్ అందించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు కిష్టయ్య, శ్రీవర్ధన్, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

సీపీఆర్‌తో ప్రాణాలు కాపాడొచ్చు



కమలాపూర్ : సీపీఆర్‌పై ప్రత్యక్ష ప్రదర్శన ద్వారా అవగాహన కల్పిస్తున్న డాక్టర్ నాగరాజు



ఆత్మకూరు : సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ పుష్పలీల



పరకాల : సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి స్వాతి

కమలాపూర్ : ప్రతిఒక్కరూ సీపీఆర్ విధానం నేర్చుకోవడం సమాజానికి ఎంతో అవసరమని, సీపీఆర్ ప్రయత్నంతో ప్రాణాన్ని కాపాడొచ్చని డాక్టర్ నాగరాజు అన్నారు. మండల కేంద్రంలోని ఎంజేపీ బాలుర గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులకు గురువారం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సీపీఆర్‌పై అవగాహన, శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు, వైద్య నిపుణులు గుండె ఆగిపోయిన సందర్భాల్లో తక్షణమే సీపీఆర్ ఎలా చేయాలి, ఛాతీపై ఒత్తిడి, శ్వాస ఎలా ఇవ్వాలనే అంశాలపై ప్రత్యక్ష ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించి శిక్షణనిచ్చారు. ఎంజేపీ ప్రిన్సిపాల్ డాక్టర్ తాడూరి రవీందర్, వైద్యులు డాక్టర్ అరుణ్, హెల్త్ అసిస్టెంట్లు రాము, బాబు, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరకాల : హృదయ స్పందన ఆగినప్పుడు శ్వాసను అందించే ప్రక్రియ (సీపీఆర్) అత్యవసర వైద్య ప్రక్రియ అని పరకాల వైద్యాధికారి స్వాతి తెలిపారు. గురువారం సీపీఆర్‌పై ప్రభుత్వ జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. రక్త ప్రసరణ ఆగితే గుండెపోటుకు గురయ్యే అవకాశాలు ఉంటాయని, అలాంటి సమయంలో తక్షణమే సీపీఆర్ చేస్తే ప్రాణపాయస్థితి నుంచి బయటపడే అవకాశాలు ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సంపత్‌కుమార్, ఎన్ఎస్ఎస్ కన్వీనర్ సర్దార్ పాల్గొన్నారు.

ఆత్మకూరు : మండలంలోని గూడెప్పాడులో గల ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాలలో గురువారం ఆత్మకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. అలాగే విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ పుష్పలీల మాట్లాడుతూ.. విద్యార్థులు వ్యక్తిగత శుభ్రతపై శ్రద్ధ వహించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



వేలేరులో..

వేలేరు : మండల కేంద్రంలోని గురుకుల పాఠశాల విద్యార్థులకు గురువారం 108 అంబులెన్స్ సిబ్బంది సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుతం వయస్సుతో సంబంధం లేకుండా గుండె సంబంధిత మరణాలు సంభవిస్తున్నాయని అన్నారు. ప్రాణాలు కాపాడేందుకు సీపీఆర్ ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. సీపీఆర్ ఎలా చేయాలనే విధానంపై శిక్షణ కల్పించారు. తదితరులు పాల్గొన్నారు.

బాకీసొమ్మును ప్రజలకు చెల్లించాలి



బాకీకార్డుపై ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

దామెర : రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు బాకీపడిన సొమ్మును వెంటనే చెల్లించాలని మాజీ వైస్ ఎంపీపీ జాకిర్‌అలీ డిమాండ్ చేశారు. మండలంలోని ఊరుగొండలో గురువారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రూపొందించిన బాకీకార్డుపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలకు బాకీపడిందన్నారు. ఇచ్చిన హామీల ప్రకారం ప్రజలకు చెల్లించాల్సిన బాకీ సొమ్ము వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గోగుల సత్యనారాయణరెడ్డి, నాయకులు సునీల్‌రెడ్డి, వినయ్, సతీశ్, సుదర్శన్, ఆరోగ్యం, రాజు, విద్యాసాగర్, రాజేందర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆశ్లేష బలిపూజ



ఆశ్లేష బలిపూజలో పాల్గొన్న భక్తులు

ధర్మసాగర్ : మండలంలోని క్యాతంపల్లి గ్రామంలో గల నవనాగ సుబ్రహ్మ ణ్యేశ్వరస్వామి దేవస్థానంలో ఆశ్లేష నక్షత్రాన్ని పురస్కరించుకుని గురువారం ఆశ్లేష బలిపూజను ఘనంగా నిర్వహించారు. వివాహం, సంతానం, సకల కార్యసిద్ధికి సర్వదోష నివృత్తికి నవంబర్ 26వ తేదీన మార్గశిర శుద్ధ షష్ఠి, సుబ్రహ్మణ్య షష్ఠి సందర్భంగా భక్తులు 41 రోజుల పాటు సుబ్రహ్మణ్యస్వామి మాలాధరణ స్వీకరించనున్నట్లు సుబ్రహ్మణ్య ఉపాసకుడు పవన్‌శర్మ పేర్కొన్నారు. 21 రోజుల మాలాధరణ స్వీకరించేవారు కార్తీక పౌర్ణమిన, 11 రోజులు మాలాధరణ స్వీకరించేవారు నవంబర్15న ధరించాలని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

ఒంటిమామిడిపల్లి ఉపాధ్యాయుడి ప్రతిభ



ఐనవోలు : రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎస్సీఈఆర్టీ) ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఉపాధ్యాయ సదస్సులో హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం ఒంటిమామిడిపల్లి పీఎంశ్రీ జెడ్పీహైస్కూల్ గణితశాస్త్ర ఉపాధ్యాయుడు చిదురాల శ్రీనివాస్ ఉత్తమ ప్రతిభ కనబరిచారు. మాధ్యమిక పాఠశాల విద్యార్థుల విద్యా ప్రదర్శనపై కౌన్సెలింగ్ ప్రభావం అనే అంశంపై తెలంగాణ వ్యాప్తంగా ఉపాధ్యాయులు 180 పరిశోధన పత్రాలు సమర్పించారు. అందులో 30 ఉత్తమ పరిశోధన పత్రాలను ఎంపిక చేయగా చిదురాల శ్రీనివాస్ పరిశోధన పత్రం ఒకటిగా నిలిచింది. కాగా బుధవారం హైదరాబాద్‌లోని గోదావరి ఆడిటోరియంలో జ్యూరీ సమక్షంలో పరిశోధన పత్రం ప్రజెంటేషన్ విజయవంతంగా పూర్తిచేసినట్లు శ్రీనివాస్ తెలిపారు. ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ రమేశ్, ముఖ్య అతిథిగా ఉస్మానియా యూనివర్సిటీ సైకాలజీ విభాగం ప్రొఫెసర్ రమాదేవి, బీఈడీ కళాశాల సైకాలజీ ప్రొఫెసర్ స్వాతి న్యాయనిర్ణేతలుగా వ్యవహరించగా ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ రమేశ్ ప్రశంసపత్రం అందించారు.

కృష్ణమూర్తిగౌడ్‌కు జాతీయ ఉత్తమ అవార్డు



కమలాపూర్ : మండల కేంద్రానికి చెందిన జక్కు కృష్ణమూర్తిగౌడ్ పీపుల్ హెల్పింగ్ హ్యాండ్స్ ట్రస్ట్ నుంచి గురువారం జాతీయ ఉత్తమ గురు అవార్డ్–2025 అందుకున్నారు. కరీంనగర్‌లో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న ఆయన.. విద్యార్థుల్లో విజ్ఞాన్ని పెంపొందిస్తూ సృజనకారుడిగా, సమాజంలోని పలు అంశాలపై చైతన్య స్ఫూర్తిని నింపేందుకు సాహిత్యకారుడిగా, ప్రముఖ రేడియో, టీవీ, రంగస్థల కళాకారుడిగా విభిన్న పాత్రలు పోషిస్తూ ఉత్తమ సేవలు అందిస్తున్నందుకు ఈ అవార్డును ప్రదానం చేసినట్లు ఆ ట్రస్ట్ చైర్మన్ గంగారపు మల్లేశం తెలిపారు. బుధవారం కళాభారతి ఆడిటోరియంలో అవార్డుతో పాటు జ్ఞాపిక, మెడల్ అందించి శాలువా, ప్రశంసపత్రంతో సత్కరించినట్లు పేర్కొన్నారు. దీంతో పలువురు ఉపాధ్యాయులు, కవులు, కళాకారులు, ప్రజాప్రతినిధులు అభినందనలు తెలిపారు.